# చలో ఢిల్లీ అంటే సరే పదండి!

“ఏమేవ్ -
ఒసేయ్ ;
ఓసి పీనుగూ -
ఇదుగో... నిన్నే,
ఏయ్....
తలుపూ,
మనిషీ,”

అంటూ ఇన్ని రకాలుగా ఆడదాన్ని హీనంగా పిలిచే పల్లెటూర్లో మొట్టమొదటి సారి మీరు నన్ను పేరెట్టి పిలిచారు.

నా కెంత సంతోషం వేసిందని? - మొగుడిచేత రోజూ దెబ్బలు తినే నా స్నేహితురాళ్ళంతా “నీ మొగుడు నిన్ను పేరెట్టి పిలుస్తాడే సీతా!” అంటూ నన్ను సింహాసనం ఎక్కించారు. మీరు నన్ను ఎన్నిమార్లు పేరెట్టి పిలిస్తే నాకంత చెడ్డ గొప్పగా వుండేది. మా ఊళ్లో ఫస్టుఫారం ప్యాసయిన ఏ అమ్మాయికీ ఉత్తరాలొచ్చేవికావు. మా జగన్నాధపురంలో నరసాపురం కాలువ గట్టున పోస్టుమాన్ సైకిలు దిగి మా గుమ్మంలో కొచ్చి నా పేరెట్టి పిలిచి మరీ ఉత్తరాలిస్తుండేవాడు. కాలవకు బిందెలు చంకన పెట్టుకుని కుళ్ళు గుడ్డలు ఉతుక్కుని, మడినీళ్లు తెచ్చుకునే ఆడవాళ్ళంతా “మొగుడికి ఉత్తరాలు రాసే రౌడీ” కింద నన్ను చూసేవారు. నేను అప్పుడప్పుడు కారాకిళ్ళీలు కూడా వేస్తాను గనుక మానాన్న “సీతిగా!” - “ఒరేయ్ రౌడీ” అని పిలుస్తుంటే ఆచనువును చూసుకుని నేను మా అమ్మని ఏడిపించుకుతినేదాన్ని. మా నాన్నకు మొగపిల్లలు పుట్టడం చావడం పుట్టడం చావడం. ఎవరూ బతక్కపోయే సరికి నన్నే ఆడపేర్లూ, మొగపేర్లూ పెట్టి ముద్దుగా పిలుచుకునేవాడు. చిరుతిళ్ళకి సరదా ఖర్చుల క్రింద ఎంత డబ్బు తగలేసేదాన్నో - మొత్తానికి నేను మా యింట్లో ఒకర్తెనే కావడం చేత గారాబంగా పుట్టి పెరిగాను.

మాఊళ్లో ఫస్ట్ లవ్ లెటర్ మొగుడికి రాసిన అమ్మాయిని నేనే!

లోపల పరికిణీ వేసుకుని చీరకట్టడం మొదలెట్టిన దాన్నినేనే!

చెప్పులు వేసుకుని రోడ్డుమీద మొగుడితో నడిచివెళ్ళి కుర్చీలో మొగుడి ప్రక్కన కూర్చుని సినిమా చూసినదాన్ని నేనే!

మొగుడు పలకరిస్తే మాట్లాడితే తప్పు పట్టుకునే పల్లెటూర్లో పెరిగిన నన్ను ఎకాఎకీ తీసికెళ్ళి పడేశారు మీరు యమునా తీరాన.

చలో ఢిల్లీ! అంటే సరే పదండి అన్నాను నేను, ఏం ఊరో బాబూ... ఊరంతా గోరీలు, శ్మశానాలు; ఆ సైకిళ్ళేవిటండీ – సైకిలు మీద కుటుంబాలు కుటుంబాలు ప్రయాణం చేస్తారు. పులిని చూచి నక్క వాత పెట్టుకున్నట్టు వాళ్ళని చూసి మీరు నాకు సైకిలు తొక్కటం నేర్పుతానన్నారు. వద్దు బాబూ అంటే మీరు ఊరుకోలేదు. భారతస్త్రీ ముందంజ వెయ్యాలి; నారీ లోకం సంకెళ్ళు త్రెంచుకుని కిటికీలు తలుపులు, గోడలు పడగొట్టి ముందుకు రావాలి అంటూ ఓ ఆడ సైకిలు తెచ్చి 'తాల్‌కటోరా గార్డెన్సుకి నన్ను లాక్కెళ్లారు. అక్కడంతా వెర్రి మొర్రి పనులు చేసేవాళ్లే పోగయారు. పెళ్లాలకి సైకిలు నేర్పేవాళ్ళు, కారుడ్రయివింగు నేర్పేవాళ్ళూ, పరుగులు పెట్టేవాళ్ళూ, వీళ్ళందర్నీ చూస్తోంటే దమ్మిడీకి పనికొచ్చేవాడొక్కడూ నాకు కనపడలే? అక్కడో చింతచెట్టు కనిపిస్తే నాకు ప్రాణం లేచివచ్చింది. చింత చిగురు పప్పు వండుతాను చింత చిగురు కోయమన్నాను. మీరు సైకిలు అద్దెకు తెచ్చినా నేను సైకిలు నేర్చుకోడానికి ఉత్సాహం చూపకపోయేసరికి మీరు పళ్లు పటపటా పిండుకున్నారు. నేను చింతచెట్టు కింద వెళ్ళి నిలబడి కర్రతో చింత చిగురు కొడుతూంటే ఆడసైకిలు కేసి మీరు చింత నిప్పులు చెరుగుతూ చూస్తున్నారు. ఆ వేళ నేను సైకిలు ఎందుకు నేర్చుకోలేదంటే మీరు పట్టుకోలేక వదిలేస్తే పడిపోతాననీ, అలా పడిపోతే మళ్లీ ఇంటిల్లిపాదికీ చాకిరీ వంటా – పెంటా తప్పుతుందా-అంచేత-నాకున్న భయాలు నావి. నేను అంతకుముందు పెళ్లాలకి సైకిలు తొక్కడం నేర్పడంచేత కాక కిందా మీదాపడి కాళ్ళూచేతులు విరుచుకున్న వాళ్ళను చూశాను. ఏ సైకిలు ఎడ్వర్టయిజ్‌మెంటు చూసి మీకు మతిపోయిందో అనుకున్నాను. ఆ వేళ చింతచిగురు పప్పు మరీమరీ అడిగి అడిగి వేయించుకు తిన్నారు. మీ ఫ్రెండు రామేశంగారు కూడా "నీవైఫ్ చింత చిగురు పప్పు చాలా బ్రిలియంట్‌గా చేస్తుందిరోయ్" అని అన్నారు. అవునండీ ఏదన్నా బాగుంటే అలా వేళ్లు నాకుతూ తిండం చూడ్డానికి నాకు అసహ్యం బాబూ! వేళ్లు నాక్కుంటూ తింటూంటే వాళ్ళను రెండు మొట్టికాయలు మొట్టాలని పిస్తుంది. అదోటి-చేతులు కడుక్కున్నాక లుంగీతో మూతి తుడుచు కోవడం-అబ్బ! ఈ రెండు దురలవాట్లూ మీచేత మానిపించలేకపోయాను.

ఢిల్లీలో మీరు కష్టపడ్డారు నన్ను కష్టపెట్టారు. బస్సు డబ్బులు లేక మీరు మోతీబాగ్ నుంచి స్టేట్ ఎంట్రీరోడ్డు దాకా నడిచివెళ్ళి మళ్ళీ సాయంత్రం, ఆలిండియా రేడియో, సెక్రటేరియట్, తీన్‌మూర్తి అశోకా హోటలు మీదుగా చాణక్యపురి దాటి ఇంటికి నడిచి వచ్చారని వినగానే నాకు ఏడుపు ఆగేదికాదు. వెక్కివెక్కి ఏడ్చి ఫిట్ వచ్చి పడిపోయేదాన్ని. మీలా ఇంటికి నడిచి వచ్చే డబ్బులు లేనివాళ్ళను పదకొండోనెంబరు బస్సు గాళ్లని అంటారని ఎవరో అంటే ఆ రోజుల్లో నేను ఏడ్చాను. ఈచేత్తో కూరలు ఆచేత్తో సామానులు కదలడానికి లేకుండా బస్సుస్టాండు నుంచి ఇంటిదాకా సరుకులు మోసుకుంటూ వచ్చే మిమ్మల్ని చూడగానే నాకు చెప్పలేని జాలి వేసేది.

నెహ్రూగారు తీన్‌మూర్తి దగ్గర బయలుదేరే టైముకు రోజూ కాలినడకను మీరా రోడ్డు దాటుతుండేవారని, చెప్పారు నాతో. బస్సుడబ్బులు లేని నా మొగుడూ, భారత ప్రజల

హృదయాధిష్ఠానమూర్తి ఒకే రోడ్డు మీద రోజూ ఒకే సమయంలో కలియడం ఎంత చిత్రం? పదకొండో నెంబరు బస్సుగాడన్నపుడు కలిగిన దుఃఖం మరుక్షణమే ఆనందబాష్పాలుగా మారి నా పమిటచెరుగును తడిపేవి.

# సుబ్బమ్మత్త శృంగారవీథి

అచ్యుతరామయ్యగారి అరుగుమీద చెంబులో పేలాలు పోసుకుని ఓ మూల కూర్చుని పరుకూ పరుకూ నములుతూ "ఎవరా వెళ్లేది?" అని రోడ్డుమీద అలికిడి అయితే అడ్డమైన వాళ్లనీ పలకరిస్తూ, చిల్లులుపడ్డ ఆకాశంలావున్న అతుకుల బొంతను కాళ్లమీదేసుకుని కుట్టుకుంటూ "ఊర్మిళాదేవి నిద్ర" - "సీత సమర్త "- "లక్ష్మణ స్వామి నవ్వు" లాటి పాత పాటలు పాడుకొనే "సుబ్బమ్మత్త" మీకు గుర్తుందీ? మనకు పెళ్లయినపుడు అరుగుమీద చింకిచాప మీద చుట్టుకుని కూర్చున్న ముసలమ్మకు తీసుకెళ్ళి దండం పెట్టిస్తే మీకు రెండు ఇచ్చ రూపాయలు తీసి చేతిలో పెట్టి ముఖంమీద చేతులువేసి తడిమిచూసి "అందగాడేనే" అంటే మీరు మరీ సిగ్గుపడిపోతే నాకు నవ్వొచ్చి పక్కుమని నవ్వేస్తే...

"ఆ నవ్వులు కాస్త మొగుడికోసం అట్టేపెట్టే లంజకానా" అని వెన్నుమీద చరిచింది.

తాటి ముంజెలు కొట్టుకు తిన్నట్లు, చెరకు పానకం తాగినట్లు, వియ్యపురాలిజీళ్లు కొసరి కొసరి విరుచుకు తిన్నట్లుండే ఆతిట్లలోని సొగసు- అంటే తెలుగువారి తిట్లలోని కోటిదీవెనల సొగసు తెలుసుకో వాలంటే మచ్చుకి మా "సుబ్బమ్మత్త" లాంటి మూలనున్న ముసలమ్మను కదిలించాలి:

టపేటాసిల్కు గౌనులు, విమానం సిల్కుపావడాలు పట్టు పరికిణీలు, గ్లాస్కోచీరలూ కట్టుకున్న పడుచు పిల్లల మంతా కాలవ కెళ్ళే దారిలో ఎత్తరుగుల మండువాలోగిట్లోకిచేరి కొబ్బరాకు బూరలుచుట్టుకుని, తాటాకుబొమ్మలకు పెళ్లిళ్ళుచేసి గుజ్జనగూళ్లు వండుకుని చెంగుమని గెంతుతూ పాడుతూ కాలక్షేపం చేసేవాళ్ళం;

చెంబులాక్కుని చాపదాచేసి పాతగుడ్డల మూటను పట్టుకుపోయి, ఆవిడతో మీకేమ(్రా అంటే వినిపించుకోక నానా అల్లరీ చేసి ఆవిడను కవ్వించి మరీ తిట్లు తినేవాళ్ళం.

"మీ మొహం మండా-"

"మీ అమ్మకడుపు మాడ-"

"తగలెయ్య" - "పిండా కూడు"

"ఛావండి" ఇలాంటి దరిద్రపు తిట్లు ఆవిడ నోట వినలేదు.